క్లుప్తంగా

బాధితలకు అండగా వైఎస్సార్ బీమా



జగ్గయ్యపేట అర్బన్: మృతుల కుటుంబాలకు వైఎస్సార్ బీమా పథకం ఆసరాగా నిలుస్తోందని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని చాకలిబజారుకు చెందిన రేపాకుల గోపి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. గోపి కుటుంబాన్ని ఆదుకునేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకం కింద రూ.లక్ష మంజూరు చేయగా, ఆయన కుటుంబసభ్యులకు విప్ ఉదయభాను బుధవారం అందజేశారు. అనంతరం విప్ ఉదయభాన మాట్లాడుతూ అనుకోని సంఘటనలు జరిగినపుడు బాధితులను ఆదుకునేందుకు వైఎస్సార్ బీమా పథకం ఎంతో దోహదపడుతోందని వివరించారు.

నూతన ఆటోలు ప్రారంభం



జగ్గయ్యపేట అర్బన్: పట్టణానికి చెందిన ఎస్ఎస్ యూత్ సభ్యులకు చెందిన నాలుగు నూతన ఆటోలను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ బుధవారం ప్రారంభించారు. విప్ సామినేని ఉదయభాను నివాసం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో నూతన ఆటోలను వెంకటకృష్ణ ప్రసాద్ స్వయంగా నడిపి వారికి శుభాకాంక్షలు తెలిపారు. తమకు అండగా నిలిచిన వెంకటకృష్ణ ప్రసాద్‌కు ఆటో యజమానులు కృతజ్ఞతలు తెలియజేశారు.

రేపు ఆశీల వసూళ్లకు బహిరంగ వేలం

నందిగామ: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11గంటలకు ఆశీల వసూళ్లకు బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.హేమమాలిని బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పట్టణంలోని కూరగాయల మార్కెట్, రైతుబజార్, కోర్టు రోడ్డు, షాపింగ్ కాంప్లెక్స్, చిరువ్యాపారుల వద్ద నుంచి ఆశీల వసూళ్లకు సంబంధించి బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు పూర్తి వివరాల కోసం మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని కమిషనర్ సూచించారు.

పంటలసాగుపై కార్యాచరణ ప్రణాళిక

గరికపాడు(జగ్గయ్యపేట): స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ఖరీఫ్, రబీ పంటలపై బుధవారం శాస్త్రీయ సలహా సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే కోఆర్డినేటర్ కృష్ణంరాజు మాట్లాడుతూ 2024 వ్యవసాయ సీజన్‌లో ఖరీఫ్, రబీలో రైతులు ఏ పంటలు సాగు చేయాలనే కార్యాచరణ ప్రణాళికపై శాస్త్రవేత్తలతో చర్చించారు. శాస్త్రవేత్తలు రాజశేఖర్, శివప్రసాద్, లక్ష్మీకళ, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన



తక్కెళ్లపాడు(జగ్గయ్యపేట): రైతులు ఆయా పంటలసాగులో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం (డీఏఆర్‌సి) డీడీఏ మాధవిలత సూచించారు. గ్రామంలోని ఆర్‌బీకెలో వరి, మొక్కజొన్న, మిర్చి పంటల సాగుపై రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంప్లెక్స్ ఎరువులను విచక్షణారహితంగా వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వరి పంటలో పొట్టదశలో పొటాష్ వాడితే గింజ నాణ్యత, బరువు పెరిగి అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. ఏటా భూసార పరీక్షలు చేయించాలని సూచించారు. అనంతరం గ్రామంలో సాగవుతున్న మొక్కజొన్న పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ భవానీ, ఏవో వరలక్ష్మి, వీఏఏ భరత్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

జుజ్జూరు(వీరులపాడు):మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తహసీల్దార్ రాజకిషోర్ తెలిపారు. మండలంలోని జుజ్జూరులో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, వెలుతురు, మరుగుదొడ్లు, తదితర వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. అధికారులు, సిబ్బంది ఎన్నికల నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా ఊరచెరువు



పర్యాటక కేంద్రం గౌతమ సరోవరంను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను

- రూ.4.50 కోట్లతో ఊరచెరువు అభివృద్ధి
- ప్రారంభించిన విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణ ప్రజలు రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పర్యాటక కేంద్రంగా చెరువు అభివృద్ధి ప్రాజెక్టు ఎట్టకేలకు రూపుదిద్దుకుందని ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అన్నారు. రూ 4.50కోట్లతో పర్యాట కేంద్రంగా అభివృద్ధిని చేసిన ఊరచెరువును బుధవారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఊరచెరువుకు'గౌతమ సరోవరం' అని నామకరణం చేశారు. ఈసందర్భగా విప్ ఉదయభాను మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రంగా మున్సిపాలిటీగా ఉన్న జగ్గయ్యపేట పట్టణ నడిబొడ్డున సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ఊరచెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దామన్నారు. పట్టణవాసులకు ఓ ఆహ్లాదకర, సుందరవనాన్ని అందించడమే ధ్యేయంగా ఊరచెరువును అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. పట్టణంలోని ఎర్రకాలువ, వేపలవాగు కాలువల ద్వారా వచ్చే నీరు ఈ చెరువుకు సప్లయి చానల్ అయినప్పటికీ పట్టణం నుంచి వచ్చి కలిసే వ్యర్థాలు చేరువులోకి చేరి పూర్తిగా కలుషితమైపోతుండటంతో చెరువు అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు వివరించారు. కాలుష్య కాసారంలా ఉన్న చెరువు నీటిని శుభ్రపరచడంతోపాటు ఒక సుందరవనంలా తీర్చిదిద్ది భవిష్యత్ తరాలకు ప్రముఖ పర్యాటక కేంద్రంగా రూపొందించాలని తలచి పనులు చేపట్టినట్లు తెలిపారు. చెరువు అభివృద్ధిలో భాగంగా చుట్టూత రివిటింగ్, ఫెన్సింగ్, చెరువు నాలుగు వైపులా రోడ్ల అభివృద్ధి, వాకింగ్ ట్రాక్, గ్రీనరీ, లైటింగ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా జగ్గయ్యపేటను సుందరీకరించాలని తలంచినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్, తెలంగాణ ఖమ్మంలోని టూరిస్ట్ ప్రాంతమైన లకారం చెరువు మాదిరిగా పేట చెరువును అభివృద్ధి చేసేలా ప్రముఖ ఇంజనీర్లు, ఆర్కిటెక్చర్లను పిలిపించి డిజైన్ నమూనాతో ప్రత్యేక ప్రణాళికను రూపొందించి పనులు చేపట్టమన్నారు. చెరువు పర్యాటకకేంద్రంగా అభివృద్ధి చెందితే ఎక్కడ తనకు మంచిపేరు వస్తుందోననే ఉద్దేశంతో టీడీపీ వారు చెరువు అభివృద్ధి పనులపై కోర్టులో కేసు వేసి స్టే తీసుకువచ్చారని గుర్తుచేశారు. టీడీపీ నాయకుల చర్యల కారణంగా మూడునెలలపాటు నిర్మాణ పనులు ఆగిపోయాయని, లేకుంటే గతంలో 150 అడుగుల జాతీయజెండాను ఆవిష్కరించిన రోజునే ఈ చెరువును కూడా ప్రారంభించాల్సి ఉందని విప్ వివరించారు. జగ్గయ్యపేట ప్రాంతానికి చక్కటి పర్యాటక కేంద్రాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, నియోజకవర్గ యువనేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, ప్రజాప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేటలో పోలీసు కవాతు



జగ్గయ్యపేట: త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో జగ్గయ్యపేటలో పోలీసులు బుధవారం కవాతు నిర్వహించారు. శాంతి భద్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎస్ఐలు సూర్యభగవాన్, పద్మారావు, ప్రత్యేక పోలీసులు పాల్గొన్నారు.

రూ.38లక్షలతో అభివృద్ధి పనులు



రాఘవాపురంలో ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: గత ప్రభుత్వాల హయాంలో పూర్తి నిరాదరణకు గురైన గ్రామీణ ప్రాంతాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధిపథంలో పయనిస్తున్నాయని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని రాఘవాపురంలో రూ. 28లక్షలతో 40వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మించనున్న రక్షిత మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయి పనులు జరుగుతున్నాయని వివరించారు.

పల్లగిరిలో..

మండలంలోని పల్లగిరిలో జెడ్పీ నిధులు రూ. ఐదు లక్షలతో చేపడుతున్న ముస్లిం శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే జగన్‌మోహనరావు శంకుస్థాపన చేశారు. 15వ ఆర్థికసంఘం నిధులు రూ. ఐదు లక్షలతో చేపడుతున్న సిమెంట్ రోడ్డు, సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీపీ ఆకుల రంగా, సర్పంచులు పెసరమల్లి సురేష్, చాగంటి రవికిరణ్‌రెడ్డి, నెలకుదిటి శివనాగేశ్వరరావు, కృష్ణారెడ్డి, వేల్పుల రాము, గ్రామస్తులు పాల్గొన్నారు.

సచివాలయాలతో ఇళ్లముంగిటకే పాలన

కునికెనపాడు(కంచికచర్ల) : మండలంలోని కునికెనపాడులో రూ.40లక్షలతో నిర్మించిన గ్రామసచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాలనను ప్రజల ఇళ్లముంగిటకే తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలు పట్టణాలకు వెళ్లకుండా అన్ని ప్రభుత్వ సేవలు సచివాలయాల్లోనే అందుతున్న విషయాన్ని గుర్తుచేశారు. సర్పంచి బండారుపల్లి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, బత్తినపాడు సర్పంచి జంగా సంతోషరావు, నాయకులు బుడ్డి సత్యనారాయణ, మంగిశెట్టి పుల్లారావు, కార్యదర్శి కనగాల రవికుమార్, వీఆర్వో ప్రదక్షిణరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో విద్య, వైద్యరంగానికి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. ఇటువంటి సం సంక్షేమ, అభివృద్ధి పథకాలు తిరిగి రాష్ట్రంలో కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో ప్రజలంతా మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీని గెలిపించాలని ఆయన కోరారు. మండలంలోని కునికెనపాడు ఎంపీయూపీ పాఠశాలను బుధవారం సందర్శించారు. విద్యార్థుల కోసం తయారుచేస్తున్న ఆహారపదార్థాల వివరాలను కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులను అడిగితెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో వడ్డించే భోజనం నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. సర్పంచి బి.సత్యనారాయణ, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, బత్తినపాడు సర్పంచి జంగా సంతోషరావు, నాయకులు బళ్లా రాములు, శినాగమల్లేశ్వరరావు, బుడ్డి సత్యనారాయణ, హెచ్ఎం నంద్రు సురేష్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కునికెనపాడులో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



విద్యార్థులకు మిఠాయిలు పంచిపెడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



రావిరాలలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న విప్ ఉదయభాను

రావిరాల(జగ్గయ్యపేట): అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కొనియాడారు. జయంతిపురం శివారుగ్రామం రావిరాలలో నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా బీసీ కాలనీకి చెందిన 270 మందికి బుధవారం ఆయన రిజిస్ట్రేషన్ ఇళ్లపట్టాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా విప్ ఉదయభాను మాట్లాడుతూ కృష్ణానది పరివాహక గ్రామం కావడంతో వరదల సమయంలో ముంపునకు గురవుతున్న రావిరాల గ్రామస్తుల ఇబ్బందులను గమనించి, సమస్యకు శాశ్వత పరిష్కారంగా 270మందికి ఒక్కొక్కరికి రెండు సెంట్ల చొప్పున స్థలాన్ని ఇచ్చామన్నారు. ఆయా పట్టాలను రిజిస్ట్రేషన్ చేసి మరీ ఇస్తున్నట్లు వివరించారు. టీడీపీ మాదిరిగా మాటల ప్రభుత్వం కాదని, తమది చేతల ప్రభుత్వమని పేర్కొన్నారు. అనంతరం ఉదయభానును గ్రామస్తులు ఘనంగా సత్కరించారు.మంచినీటి సమస్య పరిష్కరించడంతోపాటు విద్యుత్ స్థంభాలను ఏర్పాటు చేయాలని కోరగా యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేస్తామని ఉదయభాను హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచి నరసింహారావు, ఉపసర్పంచి రోజారావు, తహసీల్దార్ శేషగిరి, ఎంపీడీవో రమేష్‌బాబు, డీటీ నాగరాజు, హౌసింగ్ ఏఈ ప్రకాశరావు, పార్టీ మండల, గ్రామ కన్వీనర్లు శ్రీనివాసగౌడ్, పాండు, నాయకులు నాగభూషణం, యోహాన్, హనుమంతరావు, గురవయ్య, హరి పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన



13జెపీటీ05-

జగ్గయ్యపేట: ప్రతిఒక్కరూ కిడ్నీలు, వాటి పనితీరుపై అవగాహన కలిగి ఉండాలని అపోలో డయోగ్నసిస్ క్లినిక్ మేనేజర్ అభిషేక్ సూచించారు. ప్రపంచ కిడ్నీ డేను పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్నీ పనిచేసే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. వేసవికాలంలో తగినంత నీరును తీసుకోవాలన్నారు. ఆరోగ్యకరమైన జీవనం కోసం ప్రతిఒక్కరూ ఎప్పటికప్పుడు వైద్యుల సలహాలు, సూచనలు తీసుకుంటూ వాటిని పాటించాలన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు అభినందనీయమని, ఈ సెంటర్ ద్వారా ఎంతోమంది పేషంట్లకు మేలు కలుగుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సలహా కమిటీ సభ్యులు కటారి హరిబాబు, తపోవన్ విద్యాలయం ప్రిన్సిపాల్ సు . దీర్, డయాలసిస్ సెంటర్ సిబ్బంది, పాల్గొన్నారు

గండేపల్లిలో ఇళ్లపట్టాలు పంపిణీ



పట్టాలు పంపిణీ చేస్తున్న సర్పంచి రవికుమార్, మట్టా శ్రీనివాసరెడ్డి

కంచికచర్ల : నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జగనన్నకాలనీల్లో పేదలకు ఇచ్చిన ఇళ్లస్థలాలను రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని సర్పంచి బొక్కా రవికుమార్ కొనియాడారు. గండేపల్లి గ్రామసచివాలయంలో బుధవారం ఆయన గ్రామంలోని మహిళలకు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్లపట్టాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా సర్పంచి మాట్లాడుతూ గ్రామంలో 166మందికి ప్రభుత్వం ఇళ్లస్థలాలు, ఇళ్లు మంజూరు చేయడంతోపాటు వారిందరికీ ఉచితంగా రిజిస్ట్రేషన్ కూడా ఇస్తోందని వివరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మట్టా శ్రీనివాసరెడ్డి, సొసైటీ డైరెక్టర్ బొక్కా రవిబాబు, నాయకులు సంగం దేవరాజు, కే రంగారావు, పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, వీఆర్వో వెంకటేశ్వరరావు, డిజిటల్ అసిస్టెంట్ నాగలక్ష్మి పాల్గొన్నారు. ప్రభుత్వం స్థలాలను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడంపై లబ్ధిదారులైన మహిళలు హర్షం వ్యక్తంచేశారు. లబ్ధిదారుల అభిప్రాయాలు.. వారి మాటల్లోనే...

సొంతింట్లో ఉంటున్నాం..



నేను వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. ఎటువంటి ఆస్తులు లేవు. ఇప్పటివరకు అద్దె ఇంటిలోనే ఉంటున్నాం. సీఎం జగనన్న ప్రభుత్వం స్థలం ఇవ్వడంతో ఇల్లు కట్టుకున్నాం. మహిళలకు అండగా నిలిచిన సీఎం జగనన్నకు ప్రత్యేక ధన్యవాదాలు. - షేక్ గౌసియా

మరోసారి జగనన్న గెలిపిస్తాం..



నాకు ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. నా కొడుకు ఏడోతరగతి చదువుతుండగా, ప్రభుత్వం నాకు ఏటా అమ్మ ఒడి పథకాన్ని అందిస్తోంది. పేదలకు మేలు చేస్తున్న సీఎం జగనన్నను మరోసారి గెలిపించుకుంటాం. -నల్లమోతుల వేణు

జగనన్నకు రుణపడి ఉంటాం..



సొంతిల్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మాకు జగనన్న ప్రభుత్వం ఇంటిస్థలం ఇచ్చింది. డ్వాక్రా రుణమాఫీ జరిగింది. అమ్మ ఒడి కింద ఏటా డబ్బులు ఇస్తున్నారు. మాలాంటి పేదలను ఆదుకుంటున్న జగనన్నకు రుణపడి ఉంటాం. - యరగొర్ల దుర్గ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనుగంచిప్రోలు: గ్రామంలో గురువారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్‌సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ పూర్ణచంద్రరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బైపాస్ రోడ్డులో నూతన విద్యుత్ స్తంభాలకు వైర్ లాగుతున్న కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సెక్టార్, రూట్ ఆఫీసర్లతో ఆర్డీవో సమీక్ష



నందిగామ: ఎన్నికల విధుల్లో సెక్టార్, రూట్ ఆఫీసర్లు సమర్థవంతంగా పనిచేయాలని ఆర్డీవో ఏ రవీంద్రరావు సూచించారు. స్థానిక కేవీఆర్ కళాశాలలో బుధవారం ఆయన సెక్టార్ అధికారులు, రూట్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.సెక్టార్, రూట్ ఆఫీసర్ల విధివిధానాలను వివరించడంతోపాటు పోలింగ్ స్టేషన్‌ల వద్ద ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలపై చర్చించారు. ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో ఏసీపీ రవికిరణ్, నియోజకవర్గపరిధిలోని ఆయా మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.

మహిళా సాధికారితే జగనన్న ధ్యేయం



లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న సామినేని విమలాభాను

వత్సవాయి : మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తునారని సామినేని విమలాభాను ఫౌండేషన్ చైర్‌పర్సన్ విమలాభాను పేర్కొన్నారు. వత్సవాయిలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ కల్యాణ మండపంలో వైఎస్సార్ చేయూత నాలుగో విడత నగదు పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. లబ్ధిదారులకు నమూనా చెక్కును విమలాభాను అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మండలంలోని మహిళలకు వైఎస్సార్ చేయూత నాలుగోవిడత కింద రూ.7.24కోట్లు అందించినట్లు తెలిపారు. గతంలో చంద్రబాబు దొంగహామీలను ఇచ్చి రాష్ట్రంలోని మహిళలను మోసం చేశారని, మరోమారు ఇంకొన్ని హామీలతో మోసం చేసేందుకు కూటమిలా వస్తున్నారని విమర్శించారు. అందరికీ మంచిచేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మరోసారి అందరూ అండగా నిలవాలని కోరారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గంగిపోగు శిరీష, సర్పంచి భూక్యా సీతమ్మ, ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, ఎన్టీఆర్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షులు రంగిశెట్టి ముత్తయ్య, మండల పార్టీ అధ్యక్షులు గుత్తా శంకరరావు పాల్గొన్నారు.

దుర్గమ్మ నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి అనకాపల్లికి చెందిన భక్తులు బుధవారం రూ.లక్ష విరాళం సమర్పించారు. అనకాపల్లి పెరుమాళ్ల వీధికి చెందిన శ్రీనాథు శ్రీనివాసరావు దంపతులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,01,002 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, వేదపండితులు ఆశీర్వచనం, దేవస్థాన ప్రత్యేక ఆహ్వానితులు జక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

మేలు చేస్తేనే ఆశీర్వదించండి

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

కంచికచర్ల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికి మేలు జరిగి ఉంటేనే తిరిగి తనను, వైఎస్సార్ సీపీని ఆదరించాలని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ప్రజలను కోరారు. కంచికచర్లలో బుధవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. వారి యోగక్షేమాలతోపాటు ఇబ్బందులను అడిగితెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించి, ఆయా పథకాల క్యాలెండర్‌ను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99శాతం నెరవేర్చారని గుర్తుచేశారు. ఈసారి కూడా టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన, బీజేపీలతో పొత్తుపెట్టుకుని మరోసారి రాష్ట్రాన్ని మోసం చేసేందుకు చూస్తున్నాడన్నారు. 2019లో ప్రధాని నరేంద్రమోడీని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టి, తిరిగి మళ్లీ ఆయనతోనే పొత్తుపెట్టుకోవడం చంద్రబాబుకే చెల్లిందని ఎద్దేవా చేశారు. ఎవరు ఎన్నిపొత్తులు పెట్టుకున్నా, రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ మరోసారి విజయం సాధిస్తుందని తెలిపారు. చేసిన మేలుచూసి మరోసారి సీఎం జగనన్నను ఆశీర్వదించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వివరించారు. కార్యక్రమంలో సర్పంచి వేల్పుల సునీత, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ వేమా సురేష్‌బాబు, పార్టీ మండల కన్వీనర్ నన్నపనేని నరసింహారావు, ఎంపీటీసీ సభ్యులు మాడుగుల మధుబాబు, నాయకులు దేవరకొండ గురవయ్య, వేల్పుల శ్రీనివాసరావు, దాసరి రాంబాబు, నారిశెట్టి శ్రీనివాసరావు, ఎం. పాండు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు

డ్రైనేజీల్లో పూడికతీత

గుమ్మడిదుర్రు(పెనుగంచిప్రోలు): మండలంలోని గుమ్మడిదుర్రులో బుధవారం పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు, పారిశుద్ధ్య పనులను సర్పంచి నక్కా కమల పర్యవేక్షించారు. గ్రామంలో మురుగుకాల్వలను శుభ్రం చేయటంతోపాటు దోమల మందు స్ప్రే చేశారు. పారిశుద్ధ్య నిర్వహణలో గ్రామస్తులు కూడా సహకరించాలని సర్పంచి కోరారు.